## విలేకరులు కావలెను

మనవార్త దినపత్రిక లో
పనిచేయుటకు విలేకరులు కావలెను
తెలంగాణ రాష్ట్రంలో అన్ని జిల్లాల వారీగా స్టాఫ్ రిపోర్టర్స్, మరియు నియోజక వర్గాల వారిగా మండల స్థాయి రిపోర్టర్లు కావలెను
Cell:9247819181, 8309605189



TITLE Code TEL TEL12230

# మన వార్త
ప్రజాగళానికి అక్షర రూపం
MANA VAARTHA


## అరుణచేలేశ్వర స్వామిని దర్శించుకున్న ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి ..



జమ్మికుంట, మే 28( మన వార్త ప్రతినిధి): తిరువణ్ణామలై లోని అరుణచేలేశ్వర స్వామిని హుజూరాబాద్ నియోజకవర్గ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి మంగళవారం కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. హుజురాబాద్ నియోజకవర్గ ప్రజలు పాడి పంటలతో, పిల్లా పాపలతో,ఆరోగ్యంతో సుఖశాంతులతో ఉండాలని అరుణచేలేశ్వర స్వామిని వేడుకున్నారు.


హైదరాబాద్,కరీంనగర్,పెద్దపల్లి,రాజన్న సిరిసిల్ల   బుధవారం 29 మే 2024   పేజీలు : 4 వేల : రూ.2


## సోనియాతో భేటీ అయిన రేవంత్



హైదరాబాద్ **మన వార్త** : తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకలకు కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ అధినేత్రి సోనియాగాంధీని ముఖ్య అతిథిగా ఆహ్వానించేందుకు సీఎం రేవంత్ రెడ్డి ఢిల్లీకి వెళ్లిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా రేవంత్.. సోనియాను ఆవిర్భావ వేడుకలకు ఆహ్వానించారు. తెలంగాణ ఏర్పడి 10 సంవత్సరాలు పూర్తయినందునా వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం యోచిస్తోంది. సోనియాతో అరగంటపాటు సమావేశమై పరేడ్ గ్రౌండ్స్‌లో నిర్వహించే కార్యక్రమానికి ఆహ్వానించారు. పరేడ్ గ్రౌండ్‌లో భారీ బహిరంగ సభ నిర్వహించనుంది. ప్రముఖ కవి అందెశ్రీ రచించిన తెలంగాణ అధికారిక గీతాన్ని సోనియా గాంధీ సమక్షంలో వేడుకల్లో ఆవిష్కరించనున్నట్లు సీఎం క్యాంపు కార్యాలయ వర్గాలు తెలిపాయి. రాష్ట్ర గీతానికి కీరవాణి సంగీతం అందించారు. తెలంగాణ ఇచ్చిన పార్టీగా కాంగ్రెస్ ఉన్నప్పటికీ, తెచ్చిన క్రెడిట్‌ని మాజీ సీఎం, బీఆర్ఎస్ అధినేత తన ఖాతాలో వేసుకున్నారు. అలా దాదాపు 10 సంవత్సరాలు ఆయన రాష్ట్రాన్ని పాలించారు. రాష్ట్రాన్ని ఇచ్చిన పార్టీకి ప్రజలు తొలిసారి అధికారం కట్టబెట్టారు. దీంతో రాష్ట్ర దశాబ్ది వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు కాంగ్రెస్ నిర్ణయించింది. కార్యక్రమాన్ని గ్రాండ్‌గా సక్సెస్ చేసేందుకు రేవంత్‌రెడ్డి ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంటున్నారు.

## తెలంగాణ అధికారిక చిహ్నం మార్పుపై కేటీఆర్ ఫైర్



హైదరాబాద్ **మన వార్త** : తెలంగాణ అధికారిక చిహ్నంపై రాష్ట్ర ప్రభుత్వం మార్పులు చేయడంపై ఎమ్మెల్యే, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మండిపడ్డారు. తెలంగాణ ఖ్యాతికి నిదర్శనమైన చార్మినార్, రామప్ప దేవాలయం, కాకతీయ తోరణంను రాష్ట్ర చిహ్నం నుంచి తొలగించడంపై ఆయన నిప్పులు చెరిగారు. రాచరికపు గుర్తులు ఉన్నాయంటూ తొలగించారని, కానీ కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల్లోనూ ఇలాంటి చిహ్నాలు ఉన్నాయన్నారు. వాటినీ తొలగిస్తారా? అంటూ సీఎం రేవంత్ రెడ్డిని కేటీఆర్ ప్రశ్నించారు. సీఎం రేవంత్ రెడ్డిది రెండు నాలుకలు వైఖరి అని, ఆయన మూర్ఖపు ఆలోచనలకు చిహ్నాల తొలగింపే నిదర్శమన్నారు. మీకు కాకతీయ కళాతోరణం, చార్మినార్ చిహ్నాలు అంటే ఎందుకంత కోపమని ప్రశ్నించారు. అవి రాచరికపు గుర్తులు కాదని, వెయ్యేళ్ల సాంస్కృతిక వైభవానికి చిహ్నాలన్నారు. వెలకట్టలేని తెలంగాణ అస్తిత్వానికి నిలువెత్తు ప్రతీకలు నిలిచాయన్నారు. కాకతీయ కళాప్రభల కాంతిరేఖ 'రామప్ప', గోల్కొండ నవాబుల గొప్ప వెలుగే 'చార్మినార్' అంటూ జయజయహే తెలంగాణ అధికారిక గీతంలో కీర్తించి, చిహ్నంలో మాత్రం అవమానిస్తారా? అంటూ ధ్వజమెత్తారు. "చార్మినార్ అంటే ఒక కట్టడం కాదు.. విశ్వనగరంగా ఎదిగిన హైదరాబాద్‌కు ఐకాన్, కాకతీయ కళాతోరణం ఒక నిర్మాణం కాదు.. సిరిసంపదలతో వెలుగొందిన తెలంగాణ నేలకు నిలువెత్తు సంతకం" అని కేటీఆర్ కొనియాడారు. తెలంగాణ అధికారిక చిహ్నం నుంచి వీటిని తొలగించడం అంటే రాష్ట్ర చరిత్రను చెరిపేయడం, నాలుగు కోట్ల తెలంగాణ ప్రజల గుండెలను గాయపరచడమే అన్నారు.


# ఆగస్టు సంచలనం ఏమిటి..?



- ⇒ సీఎం రేవంత్‌రెడ్డి ఆగస్టులో కీలక నిర్ణయం తీసుకోబోతున్నట్లు సమాచారం
- ⇒ బీఆర్ఎస్ పాలనలో ప్రారంభించిన పథకాలకు బ్రేక్..?
- ⇒ కొత్త పథకాలు ప్రారంభం కాబోతున్నాయా.?
- ⇒ 33 జిల్లాలను 17 జిల్లాలకు కుదించేందుకు ప్రయత్నాలు


హైదరాబాద్ **మన వార్త** : అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లోనే తనదైన మార్కు చూపుతున్న తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి త్వరలో కీలక నిర్ణయం తీసుకోబోతున్నట్లు తెలుస్తోంది. ఈమేరకు సీఎంవో నుంచి, గాంధీ భవన్ నుంచి లీకులు వస్తున్నాయి. దీంతో అందరిలో ఆసక్తి నెలకొంది. ఆగస్టు అంటే తెలుగు రాష్ట్రంలో సంక్షోభం గుర్తొస్తుందని, ముఖ్యంగా టీడీపీకి ఇది ఆనవాయితీగా మారింది. ఈ నేపథ్యంలో రేవంత్ ఆగస్టు సంచలనం ఏమిటా అని అంతా ఆరా తీస్తున్నారు. బీఆర్ఎస్ పాలనలో ప్రారంభించిన పథకాలు ఇప్పటికీ అమలవుతున్నాయి. వాటిలో కొన్నింటిని ఆగస్టులో పక్కన పెట్టాలని రేవంత్ భావిస్తున్నారు. కొన్నింటి పేర్లు మారుస్తారని తెలుస్తోంది. కొన్ని కొత్త పథకాలు ప్రారంభిస్తారని భావిస్తున్నారు. ఈమేరకు సీఎం ఇప్పటికే అధికారులకు ఆదేశాలు ఇచ్చినట్లు తెలుస్తోంది. రైతుబంధును రైతుభరోసాగా, ఆసరా పెన్షన్‌ను చేయూతగా ఇలా మొత్తం 12 పాలసీలకు సంబంధించి మార్పులు చేయనున్నట్లు ప్రచారం జరుగుతోంది. కేసీఆర్ ప్రభుత్వం మన ఊరు మన బడి పథకం ప్రారంభించి నిధులు విడుదల చేయలేద. దీంతో కాంగ్రెస్ సర్కార్ దాని స్థానంలో అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీలు అనే కొత్త వ్యవస్థకు శ్రీకారం చుట్టింది. తాజాగా టీఎస్ ఐపాస్ పాలసీలో విప్లవాత్మమైన మార్పులు తీసుకొచ్చారు. కేటీఆర్ గొప్పగా చెప్పుకున్న పాలసీని సైతం మార్చాలని సీఎం రేవంత్ ఆదేశించారు. ఒక్క పాలసీలో ఆరు పాలసీలు వస్తాయని ఆమేరకు విధి విధానాలు రూపొందించాలని అధికారులకు సూచించారు. ఇక ఆగస్టులోనే జిల్లాల పునర్వ్యవస్థీకరణపైనా కమిటీ ఏర్పాటు చేసే అవకాశం ఉంది. మండలాల్లోని గ్రామాలను కూడా సర్దుబాటు చేస్తారని తెలుస్తోంది. 33 జిల్లాలను 17 జిల్లాలకు కుదించేందుకు కమిటీ వేసి ఆ కమిటీ సూచనల మేరకు మార్పులు చేపట్టే అవకాశం ఉందని ప్రచారం జరుగుతోంది.

## బాసర ట్రిపుల్ ఐటీ ప్రవేశాలకు నోటిఫికేషన్ విడుదల




హైదరాబాద్ **మన వార్త** : తెలంగాణలోని బాసర రాజీవ్‌గాంధీ వైజ్ఞానిక, సాంకేతిక యూనివర్సిటీ (బాసర ఆర్‌జీయూకేటీ)లో 2024-25 విద్యా సంవత్సరానికి ఆరేళ్ల ఇంటిగ్రేటెడ్ బీటెక్ కోర్సులో ప్రవేశాలకు నోటిఫికేషన్ విడుదల చేసింది. జూన్ 1 నుంచి ఆన్‌లైన్ దరఖాస్తులు ప్రారంభం అవుతాయి. జూన్ 26 వరకు అర్హులైన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవడానికి అవకాశం కల్పించారు. ఈ మేరకు ఉన్నత విద్యామండలి ఉపాధ్యక్షుడు, వర్సిటీ వీసీ వి.వెంకటరమణ మే 27న వివరాలు వెల్లడించారు. ఈసారి కూడా మొత్తం 1500 సీట్లను అందుబాటులో ఉంచినట్లు ఆయన చెప్పారు. వీటిల్లో 15 శాతం సీట్లకు తెలంగాణతోపాటు ఏపీ విద్యార్థులు పోటీపడవచ్చని పేర్కొన్నారు. ఇంటర్‌లో వచ్చిన మార్కుల ఆధారంగా బీటెక్‌లో వివిధ బ్రాంచీల్లో సీట్లను భర్తీ చేస్తామని ఆయన అన్నారు. ఫస్ట్ ఇయర్‌కు ఏడాదికి ఫీజు రూ.37 వేలు ఉంటుంది. ఫీజు రీయింబర్స్‌మెంట్ అర్హత ఉన్న వారు ఆ మొత్తం ఫీజు చెల్లించాల్సిన అవసరం లేదని ఆయన అన్నారు. రిజిస్ట్రేషన్ ఫీజు కింద రూ. 1000, కాషన్ డిపాజిట్ కింద రూ.2 వేలు, ఆరోగ్య బీమా కింద రూ.700.. చొప్పున మొత్తం రూ.3,700 అదనంగా చెల్లించాల్సి ఉంటుందని వీసీ వి వెంటక రమణ వివరించారు. ఈ ఏడాది తొలి ప్రయత్నంలో పదో తరగతి పాసైన వారు మాత్రమే ఇందులో ప్రవేశాలకు అర్హులు. అలాగే విద్యార్థుల వయసు జూన్ 1 నాటికి 18 ఏళ్లకు మించకుండా ఉండాలి. ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు మాత్రం 21 యేళ్ల వరకు మినహాయింపు ఉంటుంది. గల్ఫ్ దేశాల్లో పనిచేస్తున్న భారతీయుల పిల్లలకు 5 శాతం సీట్లు సూపర్‌న్యూమరీ కింద భర్తీ చేస్తారు.

# ఈ ఘోరాన్ని వెంటనే ఆపండి :
## ఇజ్రాయెల్ కు ఐ.రా.స హెచ్చరిక



న్యూయార్క్ **మన వార్త** : రఫాలో ఇజ్రాయెల్ విరుచుకుపడుతూ చేస్తున్న దాడిని ప్రపంచ దేశాలు ముక్త కంఠంతో వ్యతిరేకిస్తున్నాయి. 45 మంది సామాన్య పౌరుల ప్రాణాలను బలిగొన్న ఈ ఘటనను తీవ్రంగా తప్పుబడుతున్నాయి. తాజాగా ఐక్యరాజ్య సమితి ఇజ్రాయెల్ ప్రభుత్వ చర్యలపై తీవ్ర స్థాయిలో ఆగ్రహాన్ని వ్యక్తం చేసింది. ఎట్టిపరిస్థితుల్లోనూ ఈ ఘోరాన్ని వెంటనే ఆపాలని తీవ్ర స్వరంతో ఇజ్రాయెల్ ను హెచ్చరించింది. ఆశ్రయం కోరిన సామాన్యులపై జరిగిన దాడి ఇది : ఐరాస ప్రధాన కార్యదర్శి ఆంటోనియో గుటెరస్ ఐరాస ప్రధాన కార్యదర్శి ఆంటోనియో గుటెరస్ ఎక్స్ వేదికగా స్పందిస్తూ.. మారణహోమం నుంచి ఆశ్రయం కోరుతున్న సామాన్యులపై జరిగిన దాడి ఇది అని అన్నారు. అనేక మంది మఱతికి కారణమైన ఇజ్రాయెల్ దుందుడుకు చర్యలను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. గాజాలో అసలు సురక్షిత ప్రాంతమే లేదని, ఈ ఘోరాన్ని వెంటనే ఆపాలని ఎక్స్ వేదికగా కోరారు. రఫాలో ఆదివారం రాత్రి ఇజ్రాయెల్ భీకర దాడులకు పాల్పడింది. ఈ ఘటనలో 45 మంది పాలస్తీనా పౌరులు ప్రాణాలు కోల్పోయారు. 200 మందికిపైగా గాయపడ్డారు. ఇప్పటి వరకు గాజా పోరులో అత్యంత పాశవికమైన దాడుల్లో ఒకటిగా దీన్ని పేర్కొంటున్నారు. దాడి జరిగిన తల్ అల్ సుల్తాన్ ప్రాంతాన్ని సురక్షితమైనదిగా ఇజ్రాయెలే ప్రకటించింది. దీంతో చాలా మంది ఇక్కడకు వచ్చి తలదాచుకుంటున్నారు. ఇప్పుడు ఆ ప్రాంతంపైనే దాడి చేయడం తీవ్ర విమర్శలకు దారితీస్తోంది. రఫాపై ఇజ్రాయెల్ దాడికి సంబంధించిన ఫొటోలు, వీడియోలు చూస్తుంటే.. ఎంత హెచ్చరించినా ఇజ్రాయెల్ యుద్ధరీతిలో మార్పు రావడం లేదనే విషయం స్పష్టమవుతోందని ఐరాస మానవ హక్కుల విభాగం హై కమిషనర్ వోల్కర్ టర్క్ అన్నారు. ఘటన జరిగిన ప్రాంతంలోని దఅశ్యాలు చాలా భయానకంగా ఉన్నాయని పేర్కొన్నారు.


మన వార్త
ప్రజాగళానికి అక్షర రూపం
MANA VAARTHA
epaper
చదవడానికి QR కోడ్‌ను స్కాన్ చేయండి
http://manavaartha.net
MANA VAARTHA


## ప్రజా భవన్‌కు బాంబు బెదిరింపు కాల్



- 10 నిమిషాల్లో పేలుతుందని హెచ్చరిక

మన వార్త :హైదరాబాద్ మహా నగరంలో బాంబు బెదిరింపు కాల్ కలకలం సృష్టించింది. ఏకంగా మాజీ సీఎం కేసీఆర్ క్యాంపు కార్యాలయం ప్రగతి భవన్.. ప్రస్తుత ప్రజాభవన్‌లోనే బాంబు పెట్టామని అగంతకులు హెచ్చరించారు. మరికాసేపట్లో పేలిపోతుంది అంటూ పోలీస్ కంట్రోల్ రూమ్ కి అగంతకుడు ఫోన్ కాల్ చేశాడు. ప్రజా భవన్‌కు బాంబు బెదిరింపు కాల్ రావడంతో అప్రమత్తమైన పోలీసులు, బాంబ్ స్క్వాడ్ బృందాలు హుటాహుటీన చేరుకుని తనిఖీలు చేస్తున్నారు. ప్రస్తుతం ఇక్కడి తెలంగాణ డిప్యూటీ భట్టి విక్రమార్క నివాసం ఉంటున్నారు. బాంబు బెదిరంపుతో సిబ్బంది అప్రమత్తం అయ్యారు.సిబ్బంది సహా అందరినీ భవన్ నుంచి ఖాళీ చేయించి బాంబ్ స్క్వాడ్ తనిఖీలు జరుపుతోంది. మరోవైపు కేసు నమోదు చేసుకున్న పోలీసులు.. ఫోన్ చేసిన ఆగంతకుడిని ట్రేస్ చేసేందుకు ప్రయత్నిస్తున్నారు.ఇటీవలే ఢిల్లీ, ముంబై, కొల్‌కతాలోని ప్రముఖ ప్రదేశాలకు బాంబు బెదిరింపు కాల్స్ వచ్చాయి. ఈ తరహా బాంబు బెదిరింపు కాల్స్ వెనుక ఓ ముఠా హస్తం ఉందని పోలీసులు అనుమానిస్తున్నారు. వరుసగా బాంబు బెదిరింపు కాల్స్ వస్తున్న నేపథ్యంలో తెలంగాణ పోలీసులు లోతుగా దర్యాప్తు చేస్తున్నారు.

## దమ్మన్నపేట తెలంగాణ రాష్ట్ర ఆదర్శ పాఠశాల, జూనియర్ కళాశాలల్లో

# అడ్మిషన్లకు దరఖాస్తుల ఆహ్వానం




**గంభీరావుపేట, మే 29 (మన వార్త ప్రతినిధి మిట్టపల్లి బాలరాజు)**
తెలంగాణ రాష్ట్ర ఆదర్శ పాఠశాల, జూనియర్ కళాశాలల్లో అడ్మిషన్లు జరుగుతున్నాయని ప్రిన్సిపాల్ డాక్టర్ రమేష్ తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పాఠశాలలోని 6వ తరగతి నుండి 10వ తరగతి వరకు ఖాళీగా ఉన్న సీట్లకు మరియు ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంలో MPC,BIPC,MEC,CEC గ్రూపులలో సీట్లకు దరఖాస్తులు స్వీకరిస్తున్నామని తెలిపారు. పాఠశాల ప్రారంభం నుండి ప్రతి సంవత్సరం పదవ తరగతిలో 100% ఉత్తీర్ణత సాధించామని ఇప్పటివరకు 34 మంది విద్యార్థులు బాసర ఐఐఐటిలో సీట్లు సాధించారని తెలిపారు. ప్రతి సంవత్సరం ఇంటర్మీడియట్లో ఉత్తమ ఫలితాలు పొందిన విద్యార్థులు కేంద్ర ప్రభుత్వ ఉపకార వేతనాలు పొందుతున్నారు అన్నారు. ఇంటర్మీడియట్లో ఉత్తమ ఫలితాలను జిల్లా స్థాయిలో సాధించడం జరుగుతుంది. 2023 -24 లో పదవ తరగతిలో ఆర్ వైష్ణవి 10 జీపీఏ.జి సోనీ 9.8 జీపీఏ. పీ మేఘన 9.7 జీపీఏ సాధించారు అన్నారు.ప్రతి సంవత్సరం ఇంటర్లో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులు కేంద్ర ప్రభుత్వం మానవ వనరుల అభివృద్ధి శాఖ వారు అందించే ఉపకార వేతనాలు పొందుతున్నారు. ఎంసెట్లో ఉత్తమ ర్యాంకులు సాధించి ఇంజనీరింగ్ బిఎస్సి నర్సింగ్ బీఫార్మసీ కోర్సులలో ప్రవేశాలు పొందుతున్నారు పి ఎం శ్రీ లో భాగంగా మండలంలో పి ఎం శ్రీ కి ఎంపికైన ఏకైక పాఠశాల, దీని ద్వారా 01.డిజిటల్ తరగతులలో ప్యానెల్ బోర్డుల ద్వారా విద్యా బోధన,02.అటల్ టింకరింగ్ ల్యాబ్ 03.సమీకృత సైన్స్ ప్రయోగశాల,04.గ్రీన్ స్కూల్ ఏర్పాటు వివిధ అవగాహన కార్యక్రమాల నిర్వహణ, 05.విజ్ఞాన విహారయాత్రల నిర్వహణ చేపట్టడం జరుగుతుంది. 06.PM యశస్వి కేంద్ర ప్రభుత్వ ఉపకార వేతనాలకు ఎంపికైన ఏకైక పాఠశాల దీనిలో భాగంగా 9వ తరగతి నుండి ఇంటర్మీడియట్ వరకు అధిక ఉపకార వేతనం పొందే అవకాశం విద్యార్థులకు కలుగుతుందని తెలిపారు

# ఎంఎంటీఎస్ రైల్వే స్టేషన్ లయోలా కాలేజ్

## అల్వాల్లో మంజూరు చేయాలని వినతి పత్రం అందజేసిన మల్కాజ్గిరి ఎమ్మెల్యే



**మల్కాజ్గిరి జిల్లా అల్వాల్ ,మే 29 (మన వార్త ప్రతినిధి: అంతోని)**
మల్కాజ్గిరి జిల్లా సికింద్రాబాద్ డిఆర్ఎం భరేష్ కుమార్ నీ మల్కాజ్గిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి మరియు కార్పొరేటర్లు ఎంఎంటీఎస్ రైల్వే స్టేషన్ లయోలా కాలేజ్ అల్వాల్లో మంజూరు చేయాలని వినతి పత్రం అందజేశారు. మల్కాజ్గిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి మాట్లాడుతూ చర్లపల్లి నుండి లింగంపల్లి వెళ్లే మార్గంలో కృష్ణమ్మ రోడ్డు మీనాక్షి ఎస్టేట్ అల్వాల్ సికింద్రాబాద్ కూడా రోజు రోజుకు పెరుగుతున్న జనాభా కు అనుగుణంగా ట్రాఫిక్ రద్దీ పెరగడంతో ఈ ప్రాంతం ప్రజలకు ఉపయోగపడే విధంగా అల్వాల్ లయోలా కాలేజ్ సమీపంలో ఎంఎంటీఎస్ రైల్వే స్టేషన్ ఏర్పాటు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో అల్వాల్ కార్పొరేటర్ జిహెచ్ఎంసి స్టాండింగ్ కౌన్సిల్ మెంబర్ చింతల శాంతి శ్రీనివాస్ రెడ్డి. బి.ఆర్ సీనియర్ నాయకులు అనిల్ కిషోర్ గౌడ్. ఢిల్లీ పరమేష్. ఎంఎంటిఎస్ రైల్వే స్టేషన్ లయోలా కాలేజ్ అల్వాల్ సాధన కమిటీ సభ్యులు రిటైర్డ్ రైల్వే ఆఫీసర్ నూర్ మొహమ్మద్.సంపత్ రెడ్డి.మురళీకృష్ణ. బెన్ని. అర్జున్. శ్రీనివాస్. తదితరులు పాల్గొన్నారు.

# నాణ్యమైన విత్తనాలనే కొనుగోలు చేయాలి..



**-వ్యవసాయ విస్తరణ అధికారి అనూష**
**వేములవాడ, మే 28 (మన వార్త ప్రతినిధి):**
వేములవాడ రురల్ మండలం లోని మర్రిపల్లి మరియు నాగయపల్లి గ్రామ రైతులు వానాకాల విత్తనం కొనుగోలు విషయంలో రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు అనే అంశం పైన మర్రిపల్లి మరియు నాగయ్య పల్లి గ్రామపంచాయతీల వద్ద రైతులకు వ్యవసాయ విస్తరణ అధికారి చేని అనూష అవగాహన సదస్సు నిర్వహించడం జరిగింది .ఆమె మాట్లాడుతూ రైతులు అదికృత డీలర్ వద్ద మాత్రమే విత్తనాలు కొనుగొలుచేయాలని లూజ్ విత్తనాలు కొనుగోలు చేయకూడదు అని రైతులకు సూచించడం జరిగింది అలాగే విత్తన పంట కాలం పూర్తి అయ్యేవరకు విత్తనాలు కొనుగోలు రసీదును భద్రపరుచుకోవాలని సూచించడం జరిగింది మరియు ఆయిల్ ఫాం పంట సాగు పై అవగాహన సదస్సు నిర్వహించడం జరిగింది మరియు ఆయిల్ ఫాం పంట సాగు చేయుటకు ప్రభుత్వం అందించే రాయితీల గురించి కూడా రైతులకు తెలియజేయడం జరిగింది ఇట్టి కార్యక్రమంలో నాగాయిపల్లి మాజీ సర్పంచ్ తంపుల సుమన్ , రైతులు జాగీరు సురేష్ లక్కం తిరుపతి, తోట్ల మహేష్ మరియు మనుపటి నర్సయ్య,తిరుపతి, పర్శరములు ,పండుగు రాజయ్య జంగం చంద్రమౌళి చెట్టిపల్లి నరేశ్ గొడుగు దేవయ్య,సుంక మల్లేశం,గోపు మల్లేశం, ,తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్ ...



**కుత్బుల్లాపూర్ మే 29 (మన వార్త ప్రతినిధి: అంతోని)**
కుత్బుల్లాపూర్ మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు కూన శ్రీశైలం గౌడ్ తన నివాసం వద్ద పలు బస్తీలకు చెందిన ప్రజలు, నాయకులు, సంక్షేమ సంఘాల ప్రతినిధులు మర్యాదపూర్వకంగా కలిసి స్థానికంగా ఉన్న పలు సమస్యలు ఆయన దృష్టికి తీసుకురాగా, సంబంధిత అధికారులతో మాట్లాడి, వాటి పరిష్కారం కోసం కృషి చేయాలని ఆదేశించారు. ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా తాను కృషి చేస్తానని మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్ అన్నారు.

# ప్రభుత్వ విప్ ను కలిసిన వెలిచాలా రాజేంద్ర రావు..



**వేములవాడ, మే 28 (మన వార్త ప్రతినిధి ):**
కరీంనగర్ కాంగ్రెస్ పార్టీ పార్లమెంట్ అభ్యర్థి వెలిచాల రాజేందర్రావు మంగళవారం ప్రభుత్వ విప్, వేములవాడ శాసనసభ్యులు ఆది శ్రీనివాస్ ను వారి స్వగృహంలో మర్యాదపూర్వకంగా కలిశారు ఈ సందర్భంగా నాయకులతో,కార్యకర్తలతో సరదాగా ముచ్చటించారు మొన్న జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో తన విజయం కోసం కష్ట పడ్డ ప్రభుత్వ విప్ కు ధన్యవాదాలు తెలిపారు అనంతరం ప్రభుత్వ విప్ వెలిచాల రాజేందర్ రావు ను ఘనంగా సత్కరించారు.

## హనుమాన్ శోభయాత్ర లో పాల్గొన్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్..



**వేములవాడ, మే 28 (మన వార్త ప్రతినిధి నందు రావు):**
వేములవాడ పట్టణంలో హనుమాన్ పెద్ద జయంతిని పునస్కరించుకొని హనుమాన్ సేవ సమితి వారి ఆధ్వర్యంలో శ్రీ నగరేశ్వర స్వామి వారి దేవాలయం నుండీ నిర్వహించిన శ్రీ హనుమాన్ శోభ యాత్ర లో ప్రభుత్వ విప్,వేములవాడ శాసనసభ్యులు ఆది శ్రీనివాస్ పాల్గొన్నారు ఈ సందర్భంగా స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు అనంతరం మాట్లాడుతూ ఆ స్వామివారి ఆశీస్సులతో ప్రజలంతా సుఖసంతోషాలతో,ఆయురారోగ్యాలతో అష్టైశ్వర్యాలతో ఉంటూ సకాలంలో వర్షాలు పడి పాడిపంటలతో అన్ని వర్గాల ప్రజలు ఆనందంగా ఉండాలని వేడుకున్నారు వారి వెంట మున్సిపల్ వైస్ చైర్మన్ బింగి మహేష్ నాయకులు సంఘ స్వామి యాదవ్,చిలుక రమేష్,కనికరపు రాకేష్,నామాల లక్ష్మీరాజు, పుల్కం రాజు,దాడి మల్లేశం, మరియు హనుమాన్ భక్తులు తదితరులు ఉన్నారు.

## దాల్మియా సిమెంట్ గోడౌన్ వాళ్లు అడ్డు అదుపు లేకుండా రోడ్డుపై పార్కింగ్..



**మేడ్చల్ జిల్లా మే 29 (మన వార్త ప్రతినిధి: అంతోని)**
మేడ్చల్ జిల్లా. కీసర మండలం నాగారం టు ఘట్కేసర్ వెళ్లే మార్గంలో ఉదయం పూట స్కూలుకు వెళ్లే విద్యార్థులకు ఉద్యోగాలకు వెళ్లే వాళ్లకి తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్న దాల్మియా సిమెంట్ గోడౌన్ వాళ్లు అడ్డు అదుపు లేకుండా రోడ్డుపై పార్కింగ్ చేస్తున్నారు అధికారులు చెప్పిన గాని మాకు ఏమి పట్టనట్టు సిమెంట్ లారీలు రోడ్డుపై అక్రమ పార్కింగ్ చేస్తున్నారు ఘట్కేసర్ వెళ్లే వాహనదారులు ఇబ్బందులకు గురవుతున్నారు ఇప్పటికైనా పోలీస్ అధికారులు తగు చర్యలు తీసుకోవాలని వాహనదారులు వాపోతున్నారు.

## మౌలాలి డివిజన్లో అభివృద్ధి పనులు త్వరగా పూర్తి చేయాలి ...




**మల్కాజ్గిరి జిల్లా మౌలాలి మే 29 (మన వార్త ప్రతినిధి: అంతోని)**
మల్కాజ్గిరి జిల్లా మౌలాలి 138 డివిజన్లో బాక్స్ డ్రైన్ పనులు ఇతర పనులు అభివృద్ధి పనులు మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు ప్రారంభించిన ఆగిపోయిన పనులు కాంగ్రెస్ ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నియమించిన ఇన్చార్జులను నియోజకవర్గంలోని పూర్తి బాధ్యత అభివృద్ధి పనులను ప్రజల సమస్యలను కాంగ్రెస్ ప్రభుత్వం అభివృద్ధిలో మల్కాజ్గిరి నియోజకవర్గ ఇన్చార్జిగా ఉన్న మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు మౌలాలి డివిజన్లో అభివృద్ధి పనులు త్వరగా పూర్తి చేయాలని విజ్ఞప్తి చేసిన ప్రజలు.చిన్నపాటి వర్షానికి ఆర్టీసీ కాలనీలోని బస్తీలో వర్షపు నీరు మురుగు నీరు ఇంటిలో ప్రవహిస్తుందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేశారు.

## ప్రత్యామ్నాయ పంటల సాగు దిశగా రైతులను ప్రోత్సహించాలి

## అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్..



**వేములవాడ, మే 28 (మన వార్త ప్రతినిధి నందు రావు):**
ప్రత్యామ్నాయ పంటలో సాగు దిశగా రైతులను ప్రోత్సహించాలని అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్ అన్నారు. మంగళవారం అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్ సమీకృత జిల్లా కలెక్టరేట్ లోని తన చాంబర్లో యాసంగి సీజన్ 2023-24 విత్తిన పైరు విస్తీర్ణములకు స్థిరీకరణ సమన్వయ సమావేశం నిర్వహించారు. మండల స్థాయిలో వివిధ అధికారులతో చర్చించి పంటల వారీగా స్థిరీకరించబడిన విస్తీర్ణం పరిగణలోకి తీసుకొని జిల్లాస్థాయి పైరు విస్తీర్ణములను తయారు చేయడం జరిగిందని అధికారులు వివరించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్ మాట్లాడుతూ యాసంగి సీజన్ లో జిల్లాలో మొత్తం 1,78,574 ఎకరంలు సాగు జరిగిందని, ఇందులో అత్యధికంగా 97.8% మేర వరి పంట సాగు చేయడం జరిగిందని అన్నారు. ప్రస్తుత సీజన్లో భూగర్భ నీటివనుల ద్వారా 1,51,100 ఎకరాలకు, ఉపరితుల జల వనరుల ద్వారా 27,474 ఎకరాలకు సాగునీరు అందించడం జరిగిందని అన్నారు. జిల్లాలో రాబోయే వ్యవసాయ సంవత్సరంలో వరికి ప్రత్యామ్నాయ పంటల సాగు దిశగా రైతులను ప్రోత్సహించాలని, ఆయిల్ పామ్, పండ్ల పెంపకం, కూరగాయల సాగు మొదలగు వాటికి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అందించే వివిధ సబ్సిడీలను రైతులకు వివరిస్తూ ప్రత్యామ్నాయ పంటల సాగు అధికంగా జరిగేలా చూడాలని అదనపు కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో ముఖ్య ప్రణాళిక అధికారి శ్రీనివాసాచారి, జిల్లా వ్యవసాయ అధికారి భాస్కర్, జిల్లా హార్టికల్చర్ సెరికల్చర్ అధికారి జ్యోతి సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ఆరోగ్య పరిశుభ్రతపై మహిళలకు అవగాహన సదస్సు..

**-జిల్లా సంక్షేమ అధికారి సరస్వతి.**




**సైదాపూర్ మే 28 (మన వార్త ప్రతినిధి రాజ్ కుమార్ కొరిమి)**
కరీంనగర్ జిల్లా సైదాపూర్ మండలం రాయికల్ తండ గ్రామపంచాయతీ పరిధిలో యూనిసెఫ్ సమస్త ఆధ్వర్యంలో మహిళల రుతు పరిశుభ్రత నిర్వహణ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి శ్రీధర్, జిల్లా సంక్షేమ అధికారి సరస్వతి పాల్గొన్నారు. ఈ సందర్భంగా సరస్వతి మాట్లాడుతూ ఆడవారికి వచ్చే నెలసరి గూర్చి మాట్లాడడానికి సిగ్గుపడవద్దని , ఆడ పిల్లలకి తమ తల్లి బాధ్యతాయుతంగా వ్యవహరించాలని చెప్పారు. మహిళలలో , బాలికలలో వ్యక్తిగత పరిశుభ్రత చాలా ముఖ్యమని , రుతు సమయంలో ప్రత్యేక శ్రద్ధ వహించాలని సరస్వతి అన్నారు. సైదాపూర్ మండల ఆరోగ్య అధికారి డాక్టర్ సౌమ్య మాట్లాడుతూ రుతుక్రమ సమయంలో ఆహార నియమాలను పాటించాలని. ఈ సమయంలో మానసికంగా ఒత్తిడికి గురి కావద్దని డాక్టర్ సౌమ్య తెలిపారు. తండాలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి హుజురాబాద్ జిల్లా వైద్యాధికారి డాక్టర్ చందు, యూనిసెఫ్ సమన్వయకర్త స్వామి,MPDO యాదగిరి, అంగన్వాడి టీచర్లు, వైద్యులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు

## శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానంకు రెండు లక్షల విరాళం అందజేసిన వెలిచాలా రాజేంద్ర రావు



**ఇల్లందకుంట : మే 28 : ( మన వార్త ప్రతినిధి దేవేందర్ )**
ఇల్లందకుంట మండల కేంద్రంలోని శ్రీసీతారామచంద్ర దేవస్థానం అభివృద్ధికి శ్రీరామనవమి కళ్యాణము రోజున రెండు లక్షల రూపాయల విరాళమును ప్రకటించిన వెలిచాల రాజేందర్ రావు మంగళవారం రోజున ఆ మొత్తం రెండు లక్షల రూపాయలను దేవస్థానానికి అందించటం జరిగినది అని ఆలయ కార్యనిర్వాహణాధికారి కందుల సుధాకర్ తెలిపారు. దేవస్థాన అభివృద్ధికి తన వంతుగా సాయం చేసిన వెలిచాల రాజేంద్రరావుకు కృతజ్ఞతలు తెలిపారు.

## కుంట శిఖం భూమిని కాపాడాలని తాసిల్దార్ కు వినతి..



**జమ్మికుంట, మే 28( మన వార్త ప్రతినిధి):**
కుంట శిఖం భూమిని కాపాడాలని కౌన్సిలర్ గ్రామస్థులు తాసిల్దార్ కు వినతిపత్రం అందించారు. జమ్మికుంట మున్సిపల్ పరిధిలోని ధర్మారంలో భూమిని ఆక్రమించి కబ్జా చేసి చదివిన చేసిన బాధ్యతలు చర్యలు చేపట్టాలని మున్సిపల్ కౌన్సిలర్ వీరన్న స్థానికులు జమ్మికుంట తాసిల్దార్ విజయ కు ఫిర్యాదు చేశారు. జమ్మికుంట వావిలాల ప్రధాన రోడ్డు పక్కన గుంతలతో ఉన్న భూమిని లేవట్లు లేకుండా ఆనాధికారికంగా ప్లాట్లు చేసి గుంటాకు 24 లక్షల వంతున విక్రయిస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ సందర్భంగా గ్రామస్థులు మాట్లాడుతూ ఇదే స్థలం ప్రక్కనే ఉన్న కుంట శిఖానికి సంబందించిన 33 గుంటల భూమిని ధర్మారం గ్రామానికి చెందిన వ్యక్తి ఆక్రమించి చదును చేసి అమ్మేందుకు సిద్ధమయ్యాడు అని తెలిపారు. కుంట శిఖం భూమికి హద్దులు నిర్ణయించి ఆక్రమణకు గురి కాకుండా కాపాడాలని కోరారు.

## ప్రణవ్ పై అనుచిత వ్యాఖ్యలు చేస్తే సహించేదిలేదు..




**-మిడిదొడ్డి రాజు...**
**జమ్మికుంట, మే 28( మన వార్త ప్రతినిధి):**
హుజూరాబాద్ నియోజకవర్గంలోని కొందరు వ్యక్తులు మేము కాంగ్రెస్ పార్టీ అని చెప్పుకుంటు హుజురాబాద్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి వొడితల ప్రణవ్ మీద అనుచిత వ్యాఖ్యలు చేయడం చాలా నీచమైన పనికి మాలిన చర్య అని హుజురాబాద్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా కో-ఆర్డికోనేటర్ మిడిదొడ్డి రాజు అన్నారు.తిన్నింటి వాసాలు లెక్క పెట్టే ఇంటి దొంగను ఏ ఒక్కరిని విడిచిపెట్టేది లేదని హెచ్చరించారు. అధిష్టానం నిర్ణయం మేరకు నియోజకవర్గంలో ఎవ్వరికైనా ఆపద సమయంలో మీకు నేను ఉన్నా అంటూ అందుబాటులో ఉండే ప్రణవ్ మీద అనుచిత వ్యాఖ్యలు చేస్తే సహించేది లేదని హెచ్చరించారు.ఇలాంటి తప్పుడు ప్రచారాలు మరల పునరావృతం అయితే నియోజకవర్గంలో తిరుగాలంటే బయపడేలా బుద్ధి చెబుతామని అన్నారు. తప్పుడు మాటలను హుజూరాబాద్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా తరుపున ఖండిస్తున్నామని తెలిపారు.

# వెలిగిన వీధి దీపాలు..



వీధి దీపాలు వెలగడంలేదు...

జమ్మికుంట, మే 27( మన వార్త ప్రతినిధి):
జమ్మికుంట పట్టణంలోని ప్రధాన రహదారిలో గాంధీ చౌరస్తా నుంచి రైల్వే వంతెన వరకు ఏడు వీధి దీపాలు గత ఐదు రోజులుగా వెలగడంలేదు.దీనితో బస్టాండ్ ప్రాంతంలో చీకటి నెలకొంది.రహదారి ప్రక్కన వ్యాపారం చేసుకుంటున్న వీధి వ్యాపారస్తులు,ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారు. మున్సిపల్ అధికారులు స్పందించి వీధి దీపాలను సరి చేయాలని కోరుతున్నారు.



**జమ్మికుంట, మే 28( మన వార్త ప్రతినిధి):**
**-మన వార్త దినపత్రికలో ప్రచురితం కావడంతో అధికారుల స్పందన..**
జమ్మికుంట వీధి దీపాలు వెలగడం లేదన్న వార్త మన వార్త దినపత్రికలో ప్రచురితం కావడంతో అధికారులు స్పందించి సరిచేశారు.జమ్మికుంట పట్టణంలోని ప్రధాన రహదారిలో గాంధీ చౌరస్తా నుంచి రైల్వే వంతెన వరకు ఏడు వీధి దీపాలు గత ఐదు రోజులుగా వెలగడంలేదు.దీనితో బస్టాండ్ ప్రాంతంలో చీకటి నెలకొంది.రహదారి ప్రక్కన వ్యాపారం చేసుకుంటున్న వీధి వ్యాపారస్తులు,ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారు. మున్సిపల్ అధికారులు స్పందించి వీధి దీపాలను సరి చేయాలనే వార్త మన వార్త దినత్రిక లో వచ్చిన ప్రచురనకు మున్సిపల్ అధికారులు స్పందించి సరిచేశారు. వీధి దీపాలు వెలగడంతో వీధి వ్యాపారస్తులు,ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తూ మున్సిపల్ అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు.

## సొసైటి కార్యాలయం లో బుధవారం నుండి పచ్చి రొట్ట విత్తనాల పంపిణి...



**భద్రాద్రి కొత్తగూడెం జిల్లామే28: (మన వార్తా ప్రతినిధి పాల్గుణ)**
ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం.లి. కొత్తగూడెం వారి కార్యాలయం హౌసింగ్ బోర్డు నందు పచ్చిరొట్ట విత్తనాలను బుధవారం నుండి పంపీణి చేయటం జరుగుతుందని ఆ సంఘ సెక్రటరి పండ్ల సారయ్య తెలియజేసారు. పచ్చి రొట్ట విత్తనాలు జిలుగలు 60% సబ్సిడి పై రైతులకు సరఫరా చేయటం జరుగుతుందని తెలిపారు. పచ్చి రొట్ట విత్తనాలు కావాలసిన రైతులు తప్పని సరిగా పట్టా పాస్ పుస్తకము అలాగే ఆధార్ కార్డ్ కాపీ జిరాక్స్ లను తమ వెంట తీసుకురావాలని కోరారు.పచ్చిరొట్ట విత్తనాల ధరలు విత్తన రకం1జిలుగ బస్తా బరువు 30 Kgమొత్తం ఒక బస్తా ధర 2790/-ప్రభుత్వ సబ్సిడి ఒక బస్తా కు1674/- రైతు చెల్లించ వలసిన ధర ఒక బస్తాకు 1116/- ఉంటుందని ఆయన అన్నారు. ఈ అవకాశం రైతులు సద్వినియోగం చేసుకోవాలని సారయ్య కోరారు.

## హమాలి కార్మికుల స్థితిగతులు తెలుసుకున్న ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు



**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మే 28 (మన వార్త ప్రతినిధి పాల్గుణ )**
భద్రాద్రి కొత్తగూడెం క్యాంప్ ఆఫీస్ కి వెళుతున్న తరుణంలో ,రోడ్డుపై కష్టపడుతున్న హమాలి కార్మికులనులను చూసి ఆగి రోజువారి జీవన విధానాలను స్థితిగతులను తెలుసుకొని ,కాసేపు వారితో ముచ్చటించిన కొత్తగూడెం శాసనసభ్యులు ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మీకు ఎలాంటి సహకారమైన చేయడానికి నేను సిద్ధంగా ఉన్నారు . అనంతరం హమాలి కార్మికులు మాట్లాడుతూ ఇంత మంచి మనసు ఉన్నందుకే ఆయన మహా నాయకుడు అయ్యాడు అన్నారు.అంత ఓపిక సహనం మరి ఏ ఇతర నాయకుడి వల్ల సాధ్యం కాదు, ఇప్పటివరకు చూడలేదు అని అన్నారు.

## గురుకుల విద్యాలయంలో ఇంటర్మీడియట్ దరఖాస్తుల స్వీకరణ..




**జమ్మికుంట, మే 28( మన వార్త ప్రతినిధి):**
జమ్మికుంట 2024-2025 విద్యా సంవత్సరానికి గాను జమ్మికుంట లోని సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయంలో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరానికి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్టు ప్రిన్సిపాల్ బీ కుమారస్వామి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లా వ్యాప్తంగా మిగిలిన సీట్లకు ఆన్లైన్ ద్వారా సాంఘిక సంక్షేమ గురుకులాలలో దరఖాస్తులు కోరుతున్నామని తెలిపారు. ఆసక్తి కలిగిన విద్యార్థులు ఎంపీసీ, బై పిసి గ్రుపులలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈ నెల 31 లోపు మీసేవలలో 100 రూపాయలు చెల్లించి దరఖాస్తు చేసుకోవాలని చెప్పారు. 2024-2025 సంవత్సరానికి గాను అకాడమిక్ ను జూన్ 01 న ఇంటర్ మొదటి ,రెండవ సంవత్సరాల పాఠ్యాంశాలను ప్రారంభిస్తున్నట్లు తెలిపారు.విద్యార్థులను మొదటి రోజున కళాశాలకు పంపించాలని విద్యార్థుల తల్లిదండ్రులను కోరారు.

## ఆయిల్ పామ్ సాగు రైతులకు అవగాహన శిక్షణ..






**జమ్మికుంట, మే 28( మన వార్త ప్రతినిధి):**
జమ్మికుంట లోహియ ఎడిబుల్ ఆయిల్స్ కంపెనీ మరియు కె.వి.కె అధ్వర్యంలో ఆయిల్ పామ్ సాగు రైతులకు అవగాహన శిక్షణ జమ్మికుంట లోని కృషి విజ్ఞాన కేంద్రంలో సంయుక్తంగా నిర్వహించిన కార్యక్రమంలో ఆయిల్ పామ్ సాగులాభాలు, మార్కెటింగ్ విధానం, సంబందించిన వివరాలను లోహియా ఎడిబుల్ ఆయిల్ కంపెనీ టెక్నికల్ అడ్వైసర్ రంగనాయకులు రైతులకు వివరించారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన డా ఎన్. వేంకటేశ్వర రావు సీనియర్ శాస్త్రవేత్త అండ్ హెడ్ , కె.వికె వివిధ అంతర పంటల వలన లాభాలు చేసే విదానాలను వివరించారు.ఈ కార్యక్రమం లో జిల్లా ఉద్యాన అధికారి బండారు శ్రీని వాస్ వివిధ రకాల సబ్సిడీలను రైతులకు క్షుణ్ణంగా వివరించారు. వినియోగించే విధానం గూర్చి సవివరంగా వివరణ ఇచ్చారు.ఈ కార్యక్రమలో లోహియా ఎడిబుల్ ఆయిల్ కంపెనీ అధినేత సిద్ధాంథ్ లోహియా పాల్గొని ముందుగాపంట తీసిన రైతులకు ఇతర దేశాల్లో సాగు చేసే తోటలను చూపిస్తామని హామి ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రైతులు, ఉధ్యాన అధికారులు, కెవికె శాస్త్రవేతలు పాల్గొన్నారు.

## వేములవాడ రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో దోస్తీ మీట్-2024 ఘనంగా ముగింపు వేడుకలు..



**వేములవాడ, మే 28 (మన వార్త ప్రతినిధి నందు రావు):**
కబడ్డీ ప్రథమ స్థానం చెక్కపల్లి, ద్వితీయ స్థానం నూకలమర్రి, వాలీ బల్ ప్రథమ స్థానం నూకల మర్రి, ద్వితీయ స్థానం మర్రిపల్లి గ్రామాలు,వేములవాడ రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో నూకలమర్రి హై స్కూల్ లో ఈ నెల 23 వ తేదీ న ప్రారంభం అయిన దోస్తీ మీట్ - 2024 కబడ్డీ, వాలీబాల్ క్రీడా పోటీలను ముఖ్య అతిధిగా హాజరై జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ఐపీఎస్ ప్రారంభించగా సోమవారం రాత్రి ముగిస్తున్నట్టు వేములవాడ రూరల్ సర్కిల్ ఇన్స్పెక్టర్ శ్రీనివాస్ తెలిపారు.ఈ సందర్భంగా కబడ్డీ ప్రథమ స్థానం చెక్కపల్లి, ద్వితీయ స్థానం నూకలమర్రి, వాలీ బల్ ప్రథమ స్థానం నూకల మర్రి, ద్వితీయ స్థానం మర్రిపల్లి గ్రామాలు గెలుపొందగా ఇట్టి జట్ల కు వేములవాడ డి ఎస్పీ నాగేంద్ర చారీ చేతుల మీదుగా ట్రోఫీ లు ప్రదానం చేయటం జరిగింది ఇట్టి జట్లు త్వరలో జిల్లా స్థాయిలో నిర్వహించే పోటీల్లో పాల్గొంటాయి.అనంతరం డి ఎస్పీ క్రీడాకారులను ఉద్దేశించి మాట్లాడుతూ దేశ భవిష్యత్తు నేటి యువత చేతిలో ఉంటుందని, చెడు వ్యసనాలకు అలవాటు పడి భవిష్యత్ నాశనం చేసుకోవద్దని, అదే ఉద్దేశ్యంతో కమ్యూనిటీ పోలీసింగ్ లో భాగంగా జిల్లాలో యువతను క్రీడల వైపు ప్రోత్సహించేందుకు, మాధకద్రవ్యాల వలన కలుగు అనార్ధలపై ప్రతి ఒక్కరికి అవగాహన కల్పించడానికి జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో దోస్తీ మీట్ - 2024 లో భాగంగా జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ఆధ్వర్యంలో ఈక్రీడా పోటీలు నిర్వహించడం జరిగింది అని ,యువత చదువుతో పాటుగా అన్ని రంగాల్లో రాణించాలని, క్రీడల్లో ప్రతి ఒక్కరు గెలుపు ఓటములను సమానంగా స్వీకరించాలని, అదే స్ఫూర్తి ని నిజ జీవితంలో అలవర్చుకుంటు ముందుకు సాగాలని యువతకు పిలుపునిచ్చారు.క్రీడలలో పాల్గొనడం వల్ల శారీరకంగా,ఆరోగ్యం గా దృడంగా ఉండడంతో పాటు మానసికంగా ఉల్లాసంగా, ఉత్సాహంగా ఉంటారని అన్నారు.నిజ జీవితంలో సమిష్టి కృషి తోనే విజయాలను సులువుగా చేరుకోగలమనే దానికి ఉదాహరణ క్రీడలని అన్నారు. క్రీడ ఓటమి చెందిన వారు తమ లోపాలను సవరించుకొని ముందుకు వెళ్లడం అలవర్చుకోవాలని అన్నారు.ఇట్టి కార్యక్రమం కు సహకరించిన ప్రతీ ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమం లో వేములవాడ రూరల్ ఎస్ ఐ మారుతీ,కానిస్టేబుల్ రాజశేఖర్,శంకర్, విజయ్ సారధి, గ్రామ ప్రజలు,క్రీడాకారులు పాల్గొన్నారు.

## అధిక శబ్దం చేసే 86 ద్విచక్ర వాహన సైలెన్సర్లు ధ్వంసం

**-ద్విచక్ర వాహనాలకు సైలెన్సర్లు మార్పు చేస్తే క్రిమినల్ చర్యలు**
**-జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్..**



**వేములవాడ, మే 28 (మన వార్త ప్రతినిధి నందు రావు):**
ద్విచక్ర వాహనదారులు కంపెనీతో వచ్చిన సైలెన్సర్లను ఎలాంటి మార్పు చేసిన వాహనదారుడితో పాటు మార్పు చేసిన మెకానికిపై క్రిమినల్ చర్యలు తీసుకోబడుతాయనిజిల్లా ఎస్పీ ఈ సందర్భంగా హెచ్చరించారు.జిల్లాలో గత నెల రోజుల వ్యవధిలో నిబంధనలకు విరుద్ధంగా ద్విచక్ర వాహనాల కంపెనీ సైలెన్సర్ స్థానంలో అధిక శబ్దం వచ్చే సైలెన్సర్ల ఏర్పాటుపై పోలీసులు స్పెషల్ డ్రైవ్ నిర్వహించి అధిక శబ్ధం చేసే 86 ద్విచక్ర వాహన సైలెన్సర్లను గుర్తించి , మరోమారు వినియోగించకుండా రోడ్ రోలర్ సాయంతో మంగళవారం రోజున సిరిసిల్ల బై పాస్ ప్రాంతంలో ధ్వంసం చేసారు.నిబంధనలకు విరుద్ధంగా ద్విచక్ర వాహనాల సైలెన్సర్లను మార్పు చేయడం చట్టరీత్యా నేరమని, శబ్ధ కాలుష్య నియంత్రణతో పాటు ప్రజాఆరోగ్యాన్ని దృష్టిలో వుంచుకోని అధికంగా శబ్దం చేసే ద్విచక్రవాహనలపై ప్రత్యేక దృష్టి సారించి జిల్లా వ్యాప్తంగా తనిఖీలు చేపట్టడం జరిగింది.వాహణలకు సైలెన్సర్ మార్పు చేసి శబ్ధ కాలుష్యానికి కారణమవుతున్నా వారి సమాచారం సిరిసిల్ల ట్రాఫిక్ ఎస్.ఐ 8712656441 , వేములవాడ ట్రాఫిక్ ఎస్.ఐ 8712656440 కి సమాచారం ఇవ్వాలని తెలిపారు.జిల్లాలో నిబంధనలు విరుద్ధంగా వాహనాలకు సైరన్లు బిగిస్తే వాహనాలు సీజ్ చేసి కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని, జిల్లాలో నిబంధనలకు విరుద్ధంగా పోలీస్ సైరన్లు బిగించిన 05 వాహనాలపై కేసులు నమోదు చేసి వాహనాలు సీజ్ చేయడం జరిగిందన్నారు.ఎస్పీ వెంట డిఎస్పీ చంద్రశేఖర్ రెడ్డి, సి.ఐ రఘుపతి, ట్రాఫిక్ ఎస్.ఐ రమేష్, ట్రాఫిక్ సిబ్బంది పాల్గొన్నారు.

# ఆనంద్ దేవరకొండ సినిమా చేస్తాడా అనుకున్నా



**మన వార్త** ఆనంద్ దేవరకొండ హీరోగా, ఉదయ్ బొమ్మిశెట్టి దర్శకత్వంలో తెరకెక్కించిన చిత్రం 'గం.. గం.. గణేశా'. ఈ సినిమాను హై-లైఫ్ ఎంటర్‌టైన్‌మెంట్ బ్యానర్‌పై కేదార్ సెలగంశెట్టి, వంశీ కారుమంచి నిర్మించారు. ప్రగతి శ్రీవాస్తవ, నయన్ సారిక హీరోయిన్లుగా నటించిన ఈ చిత్రం మే 31న రిలీజ్ అవ్వనుంది. ప్రమోషన్స్‌లో భాగంగా సోమవారం హైదరాబాద్‌లో ప్రీ రిలీజ్ ఈవెంట్‌ని చిత్ర బృందం నిర్వహించింది. ఈ సందర్భంగా నిర్మాత వంశీ కారుమంచి మాట్లాడుతూ.. దర్శకుడు కథ చెప్పినప్పుడు ఆనంద్ చేస్తాడా? అనే సందేహం వచ్చిందన్నారు. 'దర్శకుడు ఉదయ్ బొమ్మిశెట్టి కథ చెప్పినప్పుడు ఆనంద్ దేవరకొండ సినిమా చేస్తాడా? అనే సందేహం కలిగింది. పాత్ర నచ్చి ఆనంద్ ఓకే చేశాడు. ఈ సినిమాలో ఆయనది ఆకతాయిగా, జూలాయిగా తిరిగే పాత్ర. బేబీ సినిమాలోని పాత్రకు ఇది పూర్తి భిన్నంగా ఉంటుంది. గణేశుని విగ్రహం, డబ్బు చుట్టూ తిరిగే క్రైమ్ కామెడీ యాక్షన్ ఎంటర్‌టైనర్ గం. గం.. గణేశా. అందరికీ నచ్చుతుంది. ఆనంద్ బాగా చేశాడు. నయన్ సారిక, ప్రగతి శ్రీవాస్తవ తమ అందం, అభినయంతో అలరిస్తారు. జబర్దస్త్ ఇమ్మాన్యుయేల్ బాగా నవ్విస్తాడు. ఈ కథను నెరేషన్ కంటే దర్శకుడు బాగా తెరకెక్కించాడు' అని వంశీ కారుమంచి తెలిపారు. 'నాకు చిన్నప్పట్నుంచీ సినిమాలు అంటే పిచ్చి. బాలకృష్ణ గారికి వీరాభిమానిని. మా సొంతూరు గుంటూరు. యూఎస్‌లో తెలుగు సినిమాలన్నీ చూసేవాడ్ని. బాలయ్య బాబు సినిమాలు విడుదలైతే.. థియేటర్లలో పేపర్స్ చింపేవాడిని. యూఎస్‌లో ఆర్థికంగా సెటిల్ అయ్యాక.. భారత్ వచ్చి సినిమాలు ప్రొడ్యూస్ చేయాలనుకున్నా. అయితే లాక్‌డౌన్ టైమ్‌లో ఇక్కడికి వచ్చి.. మళ్లీ యూఎస్ వెళ్లలేకపోయా. ఆనంద్ దేవరకొండతో సినిమా స్టార్ట్ చేశా. బాలయ్యతో సినిమా తీసే అవకాశం వస్తే అదృష్టంగా భావిస్తా' అని వంశీ కారుమంచి చెప్పారు.

# మెగాస్టార్ చిరంజీవికి గోల్డెన్ వీసా



**మన వార్త** సౌత్ ఇండియన్ ఫిల్మ్ ఇండస్ట్రీ నుంచి బాలీవుడ్ వరకు తనదైన ముద్ర వేసిన మెగాస్టార్ చిరంజీవికి తాజాగా యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్(యూఏఈ)కి చెందిన కల్చర్ అండ్ టూరిజం డిపార్ట్ మెంట్ గోల్డెన్ వీసా ఇచ్చింది. ఎమిరేట్స్ ఫస్ట్ సంస్థ ద్వారా ఈ గోల్డెన్ వీసా ఇచ్చినట్టు చెబుతున్నారు. మెగాస్టార్ చిరంజీవి కంటే ముందు, బాలీవుడ్ సహా దక్షిణ భారత చలనచిత్ర పరిశ్రమకు చెందిన పలువురు తారలకు కూడా యూఏఈ ప్రభుత్వం గోల్డెన్ వీసా మంజూరు చేసింది, తలైవా రజనీకాంత్, షారుఖ్ ఖాన్, సంజయ్ దత్, సానియా మీర్జా, సల్మాన్ ఖాన్, బోనీ కపూర్, జాహ్నవి కపూర్, రణవీర్ సింగ్, మమ్ముట్టి, దుల్కర్ సల్మాన్, మౌని రాయ్, మోహన్ లాల్ వంటి వారికి కూడా యూఏఈ ప్రభుత్వం గోల్డెన్ వీసా మంజూరు చేసింది. యుఎఇ ప్రభుత్వం ఆర్థిక వ్యవస్థను ప్రోత్సహించడానికి అగ్రశ్రేణి ప్రతిభావంతులను ఆకర్షించే లక్ష్యంతో అనేక పథకాలను ప్రారంభించింది. ఈ పథకాలలో గోల్డెన్ వీసా ఒకటి. ఈజీగా అర్థం అయ్యేలా చెప్పాలంటే, గోల్డెన్ వీసా పెట్టుబడిదారులు, వ్యాపారవేత్తలు, పరిశోధకులు, వైద్య నిపుణులు, సైన్స్ మరియు జ్ఞానంతో అనుబంధించబడిన వ్యక్తులు, కళాకారులు యూఏఈలో ఎక్కువ కాలం స్థిరపడటానికి లేదా అక్కడ ఉండడానికి అనుమతిస్తుంది. ఈ వీసా పథకం 2019 సంవత్సరంలో ఫోర్స్ లోకి తెచ్చారు. అప్పటి నుంచి అమలులోనే ఉంది. ఈ వీసా 5 నుండి 10 సంవత్సరాల వరకు జారీ చేయబడుతుంది. ఇందులో వీసా హోల్డర్‌కు ప్రత్యేకాధికారాలు ఇస్తారు. ఈ వీసా ప్రధానంగా వైద్యులు, శాస్త్రవేత్తలు, సంస్కృతి మరియు కళాకారులు, క్రీడాకారులు, డాక్టరల్ డిగ్రీ హోల్డర్లకు ఇవ్వబడుతుంది. ఈ వీసాలో వీసా హోల్డర్‌కు దీర్ఘకాలిక నివాసం అనుమతించబడుతుంది.

## మరో నాలుగు రోజుల్లో టీ20 వరల్డ్ కప్ ప్రారంభం...

# భారత్ తలపడే మ్యాచ్‌లు..



మన వార్త ఐపీఎల్ ముగిసిందని బాధ పడాల్సిన అవసరం లేదు!! క్రికెట్ అభిమానులను ఉర్రూతలూగించడానికి మరో మెగా టోర్నీ సిద్ధంగా ఉంది. మరో నాలుగు రోజుల్లో టీ20 వరల్డ్ కప్ ప్రారంభం కానుంది. జూన్ 2న మొదలయ్యే ఈ టోర్నీకి అమెరికా-వెస్టిండీస్ సంయుక్తంగా ఆతిథ్యం ఇస్తున్నాయి. ఈ మహా సమరంలో మునుపెన్నడూ లేని విధంగా ఇరవై దేశాలు బరిలోకి దిగుతున్నాయి. ఈ దేశాలను అయిదు జట్ల చొప్పున నాలుగు గ్రూప్‌లుగా విభజించారు. గ్రూప్ స్టేజ్‌లో టాప్-2లో నిలిచిన జట్లు సూపర్-8కు అర్హత సాధిస్తాయి. సూపర్-8కు అర్హత సాధించిన ఎనిమిది జట్లను రెండు గ్రూప్‌లుగా ఏర్పాటు చేస్తారు. వీటిల్లో టాప్-2 జట్లు సెమీఫైనల్స్‌కు చేరుతాయి. సెమీస్‌లో గెలిచిన జట్లు జూన్ 29న బార్డబోస్ వేదికగా ఫైనల్ మ్యాచ్ ఆడనుంది. టీమిండియా గ్రూప్-ఏలో ఉంది. భారత్‌తో పాటు పాకిస్థాన్, ఐర్లాండ్ కెనడా, ఆతిథ్య జట్టు అమెరికా ఉన్నాయి. గ్రూప్-ఏ మ్యాచ్‌లన్నింటికీ అమెరికానే ఆతిథ్యం ఇస్తుంది. అయితే ఈ మ్యాచ్‌లు భిన్నసమయాల్లో ప్రారంభం కానున్నాయి. కానీ భారత్ మ్యాచ్‌లు మాత్రం రాత్రి 8 గంటలకు ప్రారంభమవుతుంది. అక్కడ స్థానిక కాలమాన ప్రకారం కొన్ని ఉదయం 9.30 గంటలకు, కొన్ని ఉదయం 10.30 గంటలకు మొదలైనా మన టైమింగ్స్‌లో మాత్రం రాత్రి 8 గంటలకే. గ్రూప్-ఏలో భారత్ తలపడే మ్యాచ్‌లు జూన్ 5: భారత్ వర్సెస్ ఐర్లాండ్, న్యూయార్క్ - రాత్రి 8 గంటలకు (స్థానికంగా ఉదయం 9.30)జూన్ 9: భారత్ వర్సెస్ పాకిస్థాన్, న్యూయార్క్ - రాత్రి 8 గంటలకు (స్థానికంగా ఉదయం 9.30)జూన్ 12: భారత్ వర్సెస్ అమెరికా, న్యూయార్క్ - రాత్రి 8 గంటలకు (స్థానికంగా ఉదయం 9.30)జూన్ 15: భారత్ వర్సెస్ కెనడా, ఫ్లోరిడా - రాత్రి 8 గంటలకు (స్థానికంగా ఉదయం 10.30)భారత జట్టు: రోహిత్ శర్మ (కెప్టెన్), యశస్వి జైస్వాల్, విరాట్ కోహ్లి, సూర్యకుమార్ యాదవ్, రిషబ్ పంత్ (వికెట్ కీపర్), సంజు శాంసన్ (వికెట్ కీపర్), హార్దిక్ పాండ్య (వైస్ కెప్టెన్), శివమ్ దూబే, రవీంద్ర జడేజా, అక్షర్ పటేల్, కుల్దీప్ యాదవ్, యజువేంద్ర చాహల్, అర్షదీప్ సింగ్, జస్?ప్రీత్ బుమ్రా, మహమ్మద్ సిరాజ్. రిజర్వ్ ప్లేయర్లు: శుభ్?మన్ గిల్, రింకూ సింగ్, ఖలీల్ అహ్మద్, అవేశ్ ఖాన్. టీ20 ప్రపంచకప్‌లో గ్రూప్‌లు:గ్రూప్-ఏ: భారత్, కెనడా, ఐర్లాండ్, పాకిస్థాన్, అమెరికా.గ్రూప్-బి: ఆస్ట్రేలియా, ఇంగ్లాండ్, నమీబియా, ఒమన్, స్కాట్లాండ్ .గ్రూప్-సి: అఫ్గానిస్థాన్, న్యూజిలాండ్, పపువా న్యూ గినియా, ఉగాండా, వెస్టిండీస్.గ్రూప్-డి: బంగ్లాదేశ్, నేపాల్, నెదర్లాండ్స్, దక్షిణాఫ్రికా, శ్రీలంక దేశాలు బరిలోకి దిగుతున్నాయి.

# తమిళ్ స్టార్ డైరెక్టర్‌తో రాంచరణ్..?




**మన వార్త** గ్లోబల్ స్టార్ రాంచరణ్ ప్రస్తుతం తమిళ్ స్టార్ డైరెక్టర్ శంకర్ దర్శకత్వంలో "గేమ్ చేంజర్" అనే మూవీ చేస్తున్నాడు. ఈ సినిమాలో బాలీవుడ్ బ్యూటీ కియారా అద్వానీ నటిస్తుండగా స్టార్ ప్రొడ్యూసర్ దిల్ రాజు ఈ సినిమాను ఎంతో గ్రాండ్ గా నిర్మిస్తున్నారు. ఈ సినిమాలో క్యూట్ బ్యూటీ అంజలి ముఖ్య పాత్రలో నటిస్తుంది. స్టార్ మ్యూజిక్ డైరెక్టర్ ఎస్. థమన్ మ్యూజిక్ అందిస్తున్నారు. ఈ సినిమా షూటింగ్ ఎప్పుడో మొదలైన కొన్ని కారణాల వల్ల షూటింగ్ ఆలస్యం అవుతూ వచ్చింది. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ శరవేగంగా జరుగుతుంది. ఈ సినిమాలో హీరో రాంచరణ్ రెండు విభిన్న పాత్రలలో నటించనున్నారు. త్వరలోనే ఈ సినిమా షూటింగ్ పూర్తి చేసి పోస్ట్ ప్రొడక్షన్ వర్క్ మొదలు పెట్టాలని దర్శకుడు శంకర్ భావిస్తున్నాడు. ఇదిలా ఉంటే రాంచరణ్ తన తరువాత సినిమాను ఉప్పెన ఫేమ్ బుచ్చిబాబుతో చేసున్నాడు. రాంచరణ్ 16 వ మూవీగా తెరకెక్కుతున్న ఈ సినిమా లాంఛనంగా ప్రారంభమైంది. త్వరలోనే రెగ్యులర్ షూటింగ్ కూడా మొదలు పెట్టనున్నారు. ఇదిలా ఉంటే తమిళ్ స్టార్ డైరెక్టర్ వెట్రిమారన్ దర్శకత్వంలో రాంచరణ్ ఓ చేయనున్నాడని తెలుస్తుంది. దర్శకుడు వెట్రిమారన్ సినిమాలంటేనే ప్రేక్షకులకు కొత్త అనుభూతిని కలిగిస్తాయి .ఆయన తీసిన దుకాలం, విసారణై, వడాచెన్నై, అసురన్, విడుతలై 1వంటి సినిమాలలో కథకే ఎక్కువగా ప్రాధాన్యత ఉంటుంది. ఆయన సినిమాలో స్టార్స్ కనిపించరు కేవలం ఆ పాత్రలే కనిపిస్తాయి. అటువంటి దర్శకుడితో రాంచరణ్ మూవీ చేయనున్నట్లు తెలుస్తుంది. గతంలో ఎన్టీఆర్ తో వెట్రిమారన్ మూవీ ఉంటుందని తెగ ప్రచారం జరిగింది. కానీ అది వర్క్ అవుట్ కాలేదు. రీసెంట్‌గా రాంచరణ్ కు దర్శకుడు వెట్రి మారన్ అద్భుతమైన కథ వినిపించినట్లు సమాచారం..రాంచరణ్ కు కూడా కథ బాగా నచ్చిందని సమాచారం .త్వరలోనే వీరి కాంబినేషన్ లో మూవీ అనౌన్స్ చేయనున్నట్లు సమాచారం

# తమన్నా షాకింగ్ కామెంట్స్!



**మన వార్త** మిల్కీ బ్యూటీ తమన్నా ప్రస్తుతం తెలుగులో వరుస సినిమాలతో దూసుకు పోతోంది. ఒకప్పుడు హీరోలతో గ్లామరస్ రోల్స్ చేస్తూ వచ్చిన ఈ భామ ఇప్పుడు హారర్ సినిమాలతో కూడా ప్రేక్షకులను పలకరిస్తుంది. ప్రస్తుతం విజయ్ వర్మ అనే నటుడుతో ప్రేమలో ఉన్న ఈ భామ త్వరలో పెళ్లి పీటలు ఎక్కేందుకు కూడా సిద్ధమవుతోంది. వీరిద్దరూ కలిసి గతంలో కొన్ని ప్రాజెక్టులు చేశారు. ఆ ప్రాజెక్టులు చేస్తున్న సమయంలో షూటింగ్ జరుగుతూ ఉండగానే వీరిలో ప్రేమ చిగురించింది ఎట్టకేలకు ఇద్దరూ ప్రేమలో పడ్డారు. వీరిద్దరూ కలిసి లస్ట్ స్టోరీస్ అని ఒక వెబ్ సిరీస్ కూడా చేశారు. అయితే అది రిలీజ్ అయి కూడా చాలా కాలం అయింది. ఈ సిరీస్ లో వీరిద్దరూ మూతి ముద్దులతో రెచ్చిపోవడమే కాదు రొమాన్స్ కూడా ఒక రేంజ్ లో పండించారు. ఆ సమయంలో ఈ సిరీస్ ని ఆమె ప్రమోట్ చేస్తున్న సమయంలో బోల్డ్ గా నటిస్తే తప్పేంటని తమన్నా కామెంట్స్ చేసింది. ఇప్పటి వరకు తాను బోల్డ్ అలాగే అడల్ట్ కంటెంట్ సీన్లకు ఓకే చెప్పలేదు కానీ అవి కూడా సన్నివేశాలు మాత్రమే కదా అని చెప్పుకొచ్చింది. అవి కూడా స్టోరీ టెల్లింగ్ లో ఒక పార్ట్ అని తనకు అర్థమైందని ఆమె పేర్కొంది. అంతేకాదు లస్ట్ స్టోరీస్ 2 కోసం చేసిన బోల్డ్ సీన్స్ లో తనకు భయంగానే టెన్షన్ గాని అనిపించలేదని ఎందుకంటే విజయ్ వర్మతో తనకు ఆ చనువు ఉందని ఆమె చెప్పుకొచ్చింది. అతనితో రొమాన్స్ ను ఎంజాయ్ చేస్తానని కూడా ఆమె కామెంట్ చేసింది.

# మహేష్ సీక్రెట్ చెప్పేసిన సితార!



**మన వార్త** టాలీవుడ్ 'సూపర్ స్టార్' మహేష్ బాబు కూతురు సితార ఘట్టమనేని సోషల్ మీడియాలో ఎంతో యాక్టివ్‌గా ఉంటారు. ఎప్పటికప్పుడు తన ఫొటోస్, రీల్స్ పోస్ట్ చేస్తూ.. ఎందరో అభిమానులను సంపాదించుకున్నారు. ఓవైపు యాడ్‌లలో నటిస్తూ.. మరోవైపు సేవా కార్యక్రమాలు చేస్తూ చిన్న ఏజ్‌లోనే తనకంటూ ఓ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకుంటున్నారు. తాజాగా సితార ఓ కార్యక్రమంలో పాల్గొనగా.. పలు ప్రశ్నలకు సమాధానాలిచ్చారు. ఈ క్రమంలోనే తన తండ్రి మహేష్ బాబుకు సంబందించిన ఓ సీక్రెట్ బయటపెట్టారు. ఇటీవల ఓ పెళ్లి వేడుకలో మహేశ్ బాబు పాల్గొనగా.. సూపర్ స్టార్ సోదరి మంజుల అతడి జుట్టు పట్టుకుని లాగారు. దానికి మహేశ్ ఇచ్చిన ఎక్స్‌ప్రెషన్ సోషల్ మీడియాలో వైరల్ అయింది. అయితే ఆ వీడియోలో మంజులను మహేశ్‌ను ఏమన్నారో? ఎవరికీ తెలియదు. ఈ విషయాన్ని సితారను అడగ్గా.. జుట్టు పట్టుకోవద్దు అని నాన్న అత్తయ్యతో అన్నారని చెప్పారు. 'జుట్టును టచ్ చేస్తే నాన్నకు అస్సలు నచ్చదు. కోపం వెంటనే వచ్చేస్తుంది. నేను నాన్న జుట్టును టచ్ చేస్తూ అప్పుడప్పుడు ఆటపట్టిస్తూ ఉంటా' సితార చెప్పుకొచ్చారు. ప్రస్తుతం సితార కామెంట్స్ నెట్టింట వైరల్ అయ్యాయి. ఈ కార్యక్రమంలోనే సితారని ఏ క్లాస్ చదువుతున్నావు అని అడగ్గా.. ఇప్పుడు సిక్స్త్ క్లాస్ అయిపోయిందని, సెవెంత్‌లోకి వెళ్తాను అని తెలిపారు. తనకు యాక్టింగ్ అంటే చాలా ఇష్టమని చెప్పారు. తాను ఇంకా చిన్న ఏజ్‌లోనే ఉన్నానని, ఫ్యూచర్‌లో నటిస్తాను అని సీతూ పాప పేర్కొన్నారు. అమ్మ దగ్గర నుంచి ఫ్యాషన్ సెన్స్ నేర్చుకుంటానని, నాన్న నుంచి యాక్టింగ్ స్కిల్స్ నేర్చుకుంటానని చెప్పారు. ఇంట్లో అమ్మ, నాన్న ఎవరూ స్ట్రిక్ట్ కాదని సితార నవ్వులు పూయించారు.

# ఇవి కూడా డిప్రెషన్ లక్షణాలే..



**మన వార్త** ఒకప్పుడు అనారోగ్య సమస్య అంటే కేవలం శారీరక సమస్యలుగానే భావించే వాళ్లు. కానీ ఇప్పుడిప్పుడే మానసిక సమస్యను కూడా ఒక అనారోగ్య సమస్యగా భావించే రోజులు వచ్చాయి. ఈ వ్యాధికి సంబంధించి అందరిలోనూ అవగాహన పెరుగుతోంది. మానసిక సమస్యలకు కూడా వైద్యం ఉంటుందని తెలుసుకుంటున్నారు. అయితే చికిత్సకు ముందు అసలు మనం మానసిక సమస్యలతో బాధపడుతున్నామన్న విషయం ఎలా తెలుసుకోవాలన్నదే ప్రశ్న. కొన్ని రకాల లక్షణాల ఆధారంగా మానసిక సమస్యను అంచనా వేయొచ్చని నిపుణులు చెబుతున్నారు. ఒక అధ్యయనం ప్రకారం శరీర ఉష్ణోగ్రత పెరగడం కూడా డిప్రెషన్ తాలుకూ లక్షణంగా నిపుణులు చెబుతున్నారు. ఇదేదో అషామాషీగా చెబుతోన్న విషయం తెలిసిందే. ఈ అధ్యయనంలో భాగంగా ప్రపంచవ్యాప్తంగా 20,000 మంది పాల్గొన్నారు. ఇందులో భాగంగా మనుషుల శరీర ఉష్ణోగ్రతను పరిగణలోకి తీసుకున్నారు. 2020లో ప్రారంభమైన ఈ అధ్యాయనం సుమారు 7 నెలల పాటు కొనసాగింది. ఇందులో తేలిన విషయం ఆధారంగా డిప్రెషన్ ఉన్న వారిలో ఇతరుల కంటే ఎక్కువ శరీర ఉష్ణోగ్రత నమోదైనట్లుతెలిపారు. డిప్రెషన్ బారిన పడిన వారిలో గుండె దడ పెరగడం, రక్తప్రసరణ వేగంగా జరగడం కారణంగా శరీరంలో సాధారణం కంటే వేడిగా మారుతుందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. ఇక డిప్రెషన్ బారిన పడిన వారు నిత్యం విచారంగా, నిస్సహాయంగా ఉంటారు. చిరాకు, రోజువారీ కార్యకలాపాలపై ఆసక్తి కోల్పోవడం, ఏ పనిపై ఏకాగ్రత ఉండకపోవడం వంటివి కూడా డిప్రెషన్ తాలుకూ లక్షణాలుగా నిపుణులు చెబుతున్నారు. దీర్ఘకాలంగా ఇలాంటి లక్షణాలతో బాధపడుతుంటే వైద్యుడిని సంప్రదించాలని నిపుణులు చెబుతున్నారు. ఇందుకు కూడా ట్యాబ్లెట్స్ అందుబాటులో ఉంటాయి. అయితే చాలా మంది మానసిక ఆరోగ్యంపై పెద్దగా అవగాహన లేకపోవడంతో లైట్ తీసుకుంటున్నారని నిపుణులు చెబుతున్నారు. దీనిపై ప్రజల్లో మరింత అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని చెబుతున్నారు.